ప్రజాశక్తి
శనివారం 21 జనవరి 2023
5
శ్రీకాకుళం



నేడు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుని పర్యటన

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు కమిషన్ కార్యాలయ కార్యదర్శి టి.వి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి 12 గంటల వరకు అరసవల్లి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని పిల్లలకు చేసే ఏర్పాట్లపై అక్కడి అధికారులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యాన ప్రభుత్వ మోడల్ స్కూళ్లు, కెజిబివి పాఠశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం కానున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలతో, ఎంఇఒలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సమయానుకూలంగా అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలో ఆకస్మికంగా పరిశీలించనున్నారు.

'ఉగాది' లక్ష్యం నెరవేరేనా?

- సకాలంలో ఇళ్లు పూర్తికాక సామూహిక ప్రవేశాలు వాయిదా
- మార్చి 23 నాటికి సిద్ధం కావాలని ఆదేశం
- 33,269 ఇళ్లు పూర్తి చేయాలని నిర్ణయం
- ఇప్పటివరకు 16,430 పూర్తి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గత నెల 21న సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కార్యక్రమం కాస్త వాయిదా పడడంతో, కనీసం ఉగాది (మార్చి 22) నాటికైనా గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. గృహ నిర్మాణాలను ఆ రోజుకు పూర్తి చేసి ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. రూరల్‌లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నా, అర్బన్‌లో మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దీంతో అధికారులు లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని కదిలిస్తూ వేగవంతమయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా 77,550 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 69,905 ఇళ్లు ఆన్‌లైన్ అయ్యాయి. ఇళ్ల నిర్మాణాలకు 61,655 మంది ముందుకొచ్చారు. వీటిలో 2,714 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. వీటిలో బిబిఎల్ (బిలో బేస్‌మెంట్ లెవల్) దశలో 25,624 ఇళ్లు, పునాది దశలో 10,308, పైకప్పు దశలో 5,170 ఇళ్లు ఉన్నాయి. శ్లాబ్ పూర్తయినవి 7,658 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 16,430 ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగాయి. వీటికి మరో 16,839 ఇళ్లను కలిపి మొత్తం 33,269 ఇళ్లను ఉగాది నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ప్రస్తుతం పనులు చేపడుతున్న తీరును పరిశీలిస్తే, వీటన్నింటినీ సకాలంలో పూర్తి చేయగలరా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పూర్తయిన ఇళ్ల నిర్మాణాలకు ఏడాది కాలం పట్టింది. ఉగాదికి సిద్ధం కావాలంటే మరో 61 రోజుల సమయం మాత్రమే ఉంది. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు పడే అవకాశం లేకపోవడంతో పనులకు ఇబ్బంది ఉండదని, అనుకున్న సమయానికి గృహ లక్ష్యాలను చేరుకుంటామని అధికారులు చెప్తున్నారు.



అర్బన్‌లో పరిస్థితి మరీ దారుణం

అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. శ్రీకాకుళం అర్బన్‌లో ఉగాది నాటికి 1900 గృహాలను సిద్ధం చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 323 ఇళ (17 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. ఇచ్ఛాపురంలో 810 ఇళ్లను లక్ష్యంగా నిర్దేశించగా ప్రస్తుతం 211 ఇళ్లు (26.05 శాతం) పూర్తయ్యాయి. పలాస-కాశీబుగ్గలో 1018 ఇళ్లను నిర్మించాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 393 గృహాలు (38.61శాతం) పూర్తయ్యాయి. ఆమదాలవలసలో మాత్రం నిర్మాణాల పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. ఇక్కడ 674 గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా తీసుకోగా, ప్రస్తుతం 468 ఇళ్లు (69.44 శాతం) పూర్తయ్యాయి.

మండలాల వారీగా నిర్మాణాల పరిస్థితి

ఉగాది నాటికి తీసుకున్న లక్ష్యాల్లో చాలా మండలాల్లో సగం కూడా పూర్తి కాలేదు. జిల్లావ్యాప్తంగా 33,269 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 16,430 (49.39 శాతం) పూర్తయ్యాయి. జిల్లా సగటుతో పోలిస్తే ఆరు మండలాలు వెనుకబడ్డాయి. సోంపేట మండలంలో 1334 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటివరకు 527 ఇళ్ల నిర్మాణాలు (39.51 శాతం)తో అట్టడుగు స్థానంలో ఉంది. వజ్రపుకొత్తూరు మండలంలో 974 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 406 ఇళ్ల నిర్మాణాలు (41.68 శాతం) పూర్తయ్యాయి. మందసలో 2425 ఇళ్లకు గానూ 1031 ఇళ్లు (42.52 శాతం) నిర్మాణం పూర్తి చేసుకున్నాయి.

కంచిలిలో 947 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, 448 గృహాలు (47.31 శాతం) పూర్తయ్యాయి. నరసన్నపేటలో 1660 గృహాలను నిర్మించాలని నిర్దేశించగా, ఇప్పటివరకు 806 ఇళ్లు (48.55 శాతం) పూర్తయ్యాయి. ఎచ్చెర్లలో ఉగాది నాటికి 1762 గృహాలను నిర్మించాలని నిర్ణయించగా, ప్రస్తుతం 868 ఇళ్లు (49.26 శాతం) నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. ఆమదాలవలస మండలంలో అత్యధికంగా 66శాతం మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక్కడ 906 గృహాలను సిద్ధం చేయాలని లక్ష్యంగా తీసుకోగా, ఇప్పటివరకు 598 ఇళ్లు పూర్తయ్యాయి.

అర్బన్‌లో వెనుకబాటుకు కారణాలు ఇవేనా?

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చాలా నత్తనడకన సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పట్టణ ప్రాంతాలకు దూరంగా లేఅవుట్లలో ప్లాట్లను ఇవ్వడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం లబ్ధిదారులు ఉంటున్న నివాస ప్రాంతం నుంచి అక్కడి వెళ్లడానికి ఎవరూ సిద్ధపడడం లేదు. ప్రస్తుత నివాస ప్రాంతాల్లోనే చిన్నపాటి వ్యాపారాలు, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాము అక్కడికి తరలివెళ్తే ఉపాధి పోతుందన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. పైగా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలను మాత్రమే అందిస్తోంది. కాస్తాకూస్తో సౌకర్యాలతో ఇళ్లు కట్టుకోవాలంటే మరో రూ.నాలుగు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు అవసరమవుతోంది. ఇళ్లు మారడానికి ఇష్టపడని వారు అప్పులు చేసి ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందనే భావనతో వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది.



బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న స్పీకర్, మంత్రి

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- చిరు ధాన్యాల సాగుకు ప్రోత్సాహం
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ విత్తనం నుంచి విక్రయాల వరకు రైతులకు అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో గతేడాది కంటే ఈ ఏడాది అధిక దిగుబడి లభించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించామనే నెపంతో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం సరికాదని, దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. వరి సాగు కంటే వాణిజ్య పంటల సాగు వల్ల రైతులకు మేలు చేకూరుతుందని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. చిరుధాన్యాలతో రైతులకు అధిక దిగుబడితో పాటు లాభం వస్తుందన్నారు. తక్కువ సమయంలో అతి తక్కువ ఖర్చుతో డ్రోన్ల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో 371 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 3.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వివరించారు. ఇందుకుగానూ 50 రోజుల్లోనే రూ.5,354 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు మాట్లాడుతూ వంశధార కుడి, ఎడమ కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 6.5 టిఎంసిల నీరు నిల్వ ఉందని, ఇందులో 4 టిఎంసిల వరకు నీటిని వ్యవసాయానికి వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ నీటిని మార్చి 31 వరకు అందించేందుకు అవకాశం ఉందని, తద్వారా 70వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు దృష్టిసారించాలన్నారు.

అనంతరం ఉద్యానవన శాఖ రూపొందించిన అరటిసాగుపై తోటబడి కరదీపికను, వ్యవసాయ శాఖ ముద్రించిన కరపత్రాలు, బుక్‌లెట్లు, డైరీలను స్పీకర్, మంత్రి తదితరులు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ శిమ్మ నేతాజీ, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, వ్యవసాయ మిషన్ సభ్యులు గొండు రఘురాం, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ పలు శాఖల అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం, రాగోలు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాసు తదితరులు పాల్గొన్నారు.

అదనంగా ఐదు కేజీలు అడుగుతున్నారు

విశ్వకిరణ్ మిల్లు వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

80 కేజీల ధాన్యం బస్తాకు అదనంగా ఐదు కేజీలు ఇస్తేనే దించాలని విశ్వకిరణ్ రైస్‌మిల్లు ప్రతినిధులు డిమాండ్ చేయడంతో రైతులు మిల్లు వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. లింగాలవలస పంచాయతీకి చెందిన రైతులు రైతుభరోసా కేంద్రంలో ట్యాగ్ చేసిన విశ్వకిరణ్ రైస్‌మిల్లుకు 250 ధాన్యం బస్తాలను తీసుకెళ్లారు. బస్తాకు ఐదు కేజీలు అదనంగా ఇస్తేనే మిల్లులో దించాలని, లేకుంటే వెనక్కి తీసుకెళ్లిపోవాలని మిల్లు యాజమాన్య ప్రతినిధులు స్పష్టం చేయడంతో కంగుతిన్నారు. అధికారులను ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాకపోవడంతో మిల్లు వద్దే ఆందోళన చేపట్టారు. అధికారులు చెప్తున్న మాటలకు, ఆచరణలో అమలవుతున్న దానికి పొంతన ఉండడం లేదని విమర్శించారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రైతులు, మిల్లరుతో మాట్లాడి ధాన్యాన్ని అన్ లోడింగ్ చేయించారు.



మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కొత్తూరు

పారాపురం బ్యాలెన్సింగ్ మినీ రిజర్వాయర్ నిర్మాణం వల్ల సర్వం కోల్పోయిన గూనభద్ర నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలన్న హైకోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంతో సుమారు 300 కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయని చెప్పారు. ఊరుకు ఆనుకుని 90 మీటర్ల కట్ట నిర్మాణం చేపట్టడంతో వ్యవసాయ, ఉపాధి హామీ పనుల్లేవని తెలిపారు. పరిహారం చెల్లించకపోవడంతో నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయిస్తే సర్వే చేసి, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించిందని చెప్పారు. ఆరు నెలలవుతున్నా హైకోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిర్వాసిత గ్రామం వద్ద ఫిబ్రవరి 11న రాకపోకలు నిలిపివేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిర్ల ప్రసాదరావు, గంగరాపు సింహాచలం, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ, నిర్వాసితులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్య.కా.స నాయకులు, నిర్వాసితులు



సంఘీబావం తెలుపుతున్న అఖిలపక్షాల నాయకులు

23న అఖిలపక్ష రాయబారం

- టోల్‌ప్లాజా కార్మికులను సర్దుబాటు చేయాలి
- అఖిలపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని, లేకుంటే వారితో పాటు ప్రత్యక్ష పోరాటంలో పాల్గొంటామని అఖిలపక్ష పార్టీల నాయకులు స్పష్టం చేశారు. టోల్‌ప్లాజా కార్మికుల పోరాటానికి మద్దతుగా అఖిలపక్ష పార్టీల సమావేశం నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈనెల 23న అఖిలపక్ష రాయబారం సమావేశం నిర్వహించడానికి తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చిలకపాలెం టోల్‌ప్లాజాలో వస్తున్న ఆదాయాన్ని తగ్గకుండా మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో టోల్ రుసుమును పెంచి సర్దుబాటు చేసినట్లుగానే కార్మికులనూ సర్దుబాటు చేయాలని డిమాండ్ చేసారు. చిలకపాలెం టోల్‌ప్లాజాలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. నేషనల్ హైవే అధికారులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. గ్రాట్యూటీ, పరిహారం చెల్లించకుండా అన్యాయం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రూ.వేల కోట్ల టోల్ రుసుములు వసూలు చేస్తున్న హైవే అధికారులు, కేంద్ర ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. దేశం కోసం సరిహద్దుల్లో కాపలా కాసిన మాజీ సైనికులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 106 మంది కార్మికులను రెండు టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని, గ్రాట్యుటీ, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జనసేన పార్టీ నాయకులు రామ్మోహన్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు డి.రామప్ప, సిపిఐ నాయకులు భాస్కరరావు, సిఐటియు కోశాధికారి ఎ.సత్యనారాయణ, చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.నర్సింహులు, ఎం.శంకరనారాయణ, ఎ.వి.ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'రియల్' వ్యాపారానికే అమరావతి

- చంద్రబాబు వ్యాపారస్తుడు
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్, అర్బన్

చంద్రబాబు నాయుడుకు చెందిన మనుషులతో నిర్వహించే రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేశారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆరోపించారు. అమరావతి చుట్టుపక్కల భూములను వారి మనుషులతో కొనుగోలు చేయించి, రాజధానిగా ప్రకటించారని ధ్వజమెత్తారు. శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాజధాని 33 వేల ఎకరాలను అభివృద్ధి చేయాలంటే మనందరి ఆదాయం 50 ఏళ్ల పాటు అమరావతికి వెచ్చించాల్సి ఉంటుందన్నారు. దీంతో హైదరాబాద్ వంటి అనుభవమే మళ్లీ ఎదురుకానుందని చెప్పారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని పార్లమెంట్ కమిటీలు చెప్పిన వాటిని చంద్రబాబు పక్కనపెట్టి తమకు అనుకూలంగా రాజధానిగా గుంటూరు, కృష్ణా చుట్టుపక్కల ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. విశాఖకు రాజధాని వస్తే ప్రయివేటు ఇన్వెస్టర్లు ముందుకొస్తారని, తద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకొస్తే మరో 30 ఏళ్లు వెనక్కి వెళ్తామన్నారు. చంద్రబాబు వ్యాపారస్తుడు అని, ఆయనకు పేదల కష్టాలు తెలియవన్నారు.

తోటపల్లి, వంశధార ప్రాజెక్టుకు ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వంశధారను వినియోగించుకునేందుకు గొట్టాబ్యారేజీ వద్ద 19 టిఎంసిల నీటిని ఎత్తిపోసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నామని చెప్పారు. దీని ద్వారా మండు వేసవిలోనూ రైతులకు నీరందిస్తామన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన హక్కుల అనుసారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే రాయిపాడు, బావాజీపేట రహదారులను నిర్మించనున్నామన్నారు. ఈ ప్రాంత రైతులు శనగ, జొన్న, రాగులు ఇలా ఆదాయం వచ్చే పంటలు వైపు మొగ్గు చూపాలన్నారు. అనంతరం 40 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చిట్టి జనార్ధనరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో యువ నేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ రఘు, రాగోలు సర్పంచ్ గేదెల చెంగళరావు, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, చల్లా రవికుమార్, అల్లు లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ ముచ్చి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సిద్ధిపేట రోడ్డుకు శంకుస్థాపన

నగరంలోని బలగ జంక్షన్ నుంచి సిద్ధిపేట వరకు రూ.44 లక్షల వ్యయంతో 1.8 కిలోమీటర్ల మేర నిర్మించ తలపెట్టిన రహదారి పనులకు మంత్రి ధర్మాన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఎస్.కాంతిమతి, ఇఇ రవినాయక్, డిఇ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'అక్షయపాత్ర'ది నాశిరక భోజనం

బాలల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు నర్సింహమూర్తి


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అక్షయపాత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని బాలల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి నరసింహమూర్తి అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భోజనం బాగా లేకపోవడంతో 30 శాతం మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్ తీసుకెళ్తున్నారని తెలిపారు. నాడు-నేడులో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా, పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య మరీ అధ్వానంగా ఉందని, అటువంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు పాఠశాలల్లో తరగతి గది సామర్థ్యానికి మించి విద్యార్థులను ఉంచుతున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులూ పాఠశాలల నిర్వహణా విధానంపై దృష్టిసారించాలని కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వేదిక కార్యదర్శి రౌతు జ్యోతికుమారి, ఉపాధ్యక్షులు ఎల్.సంపతి కుమారి, బి.సంతోష్, తాండ్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తం నాయుడుకు ఆత్మీయ స్వాగతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షునిగా ఐదోసారి ఎన్నికైన అనంతరం శుక్రవారం జిల్లాకు చేరుకున్న చౌదరి పురుషోత్తంనాయుడుకు ఆ సంఘ నాయకులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. నగరంలోని సాయిబులతోటలోని ఆయన నివాసం వద్ద అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసంతో మరోమారు సహాధ్యక్షునిగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము కానివ్వనని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతటి పోరాటాలకైనా సిద్ధంగా ఉంటానన్నారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా పుట్టుకొచ్చిన సంఘాలు ఉద్యోగుల ప్రయోజనాలను పక్కనపెట్టి గొప్పల కోసం ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి రాజకీయ మార్గం అనుసరించడం సరికాదని, ఉద్యోగ సంఘాలు విధి విధానాలను పాటించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. ఉద్యోగులకు రావాల్సిన రాయితీలు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతోనే పోరాడాలని, గవర్నర్‌ను కలవడం వల్ల ప్రయోజనం లేదన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు వెన్నుదన్నుగా ఉంటూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పురుషోత్తం నాయుడు నేతృత్వంలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి తరుణంలో ఆయన సారథ్యంలో పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. చౌదరి నారాయణమూర్తి, సూర శ్రీనివాసరావు, గురుగుబెల్లి లోకనాథం, బొడ్డేపల్లి మోహనరావు, వాణిజ్యపన్నుల శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రాయి వేణుగోపాల్, ఎన్‌జిఒ సంఘ నాయకులు కె.జయరావు, బి.పూర్ణచంద్రరావు, ఆర్.గోవిందపట్నాయక్, ఎన్‌జిఒ తాలూకా యూనిట్ల నాయకులు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు సుధాసాగర్, శ్రీరాములు, పి.వేణుగోపాలరావు తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.



పురుషోత్తం నాయుడును అభినందిస్తున్న ఉద్యోగులు

కిడ్నాప్ కలకలం

స్థానికుల అలజడితో కిడ్నాపర్లు పరారీ

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో 17 ఏళ్ల బాలిక కిడ్నాప్ కలకలం రేపింది. బాధితురాలు, కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు కాశీబుగ్గ సూదికొండ కాలనీలోని హరిజన వీధికి చెందిన బాలిక తల్లి స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలో జీడి పరిశ్రమలో కూలీగా పనిచేస్తోంది. ఇంట్లో కుమారుడు, కుమార్తెను ఉంచి గురువారం పరిశ్రమ వద్దకు వెళ్లింది. తల్లి ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుమార్తె పరిశ్రమకు వెళ్లింది. నాలుగు గంటల సమయంలో జీడి పరిశ్రమ నుంచి తల్లీ కుమార్తెలు ఇంటికి తిరిగి వస్తున్నారు. తల్లి ముందు వెళ్లగా వెనుక వచ్చిన బాలికను ఇద్దరు మహిళలు, పురుషుడు జన సంచారం లేని హుదూద్ ఇళ్ల వద్ద ఆపి పలాసకు ఎలా వెళ్లాలని దారి అడిగారు. బాలిక సమాధానం చెప్తుండగా నోట్లో గుడ్డలను కుక్కి ఎత్తుకొని హుదూద్ ఇళ్లలోకి లాక్కెళ్లారు.

బాలిక కాళ్లు చేతులు కట్టి మేడ పైకి తీసుకెళ్లారు. కుమార్తె ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, కాలనీవాసులు హుదూద్ ఇళ్లు సమీప ప్రాంతాలతో పాటు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌తో పాటు పలుచోట్ల వెతికారు. గురువారం రాత్రి పది గంటల సమయంలో కిడ్నాపర్లు హిందీలో మాట్లాడుతూ బాలిక నోట్లో గుడ్డలను బయటకు తీశారు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేసింది. అదే సమయంలో అటువైపుగా బాలిక కోసం వెతుకుతున్న వారు రావడంతో కిడ్నాపర్లు అక్కడ్నుంచి పరారయ్యారు. బాలికతో పాటు అక్కడ ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఇంటికి తీసుకొచ్చారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారుడూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో 66వ రాష్ట్ర అంతర జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో మెలిగి, పట్టుదలతో సాధనచేస్తే ఉన్నత లక్ష్యాలకు చేరుకోగలరని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కరణం మల్లీశ్వరి, కాశీంఖాన్ వంటి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు రాణించారని వివరించారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా క్రీడాకారుడికి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తోందని, క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ క్రీడాకారులకు విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అథ్లెటిక్స్ మీట్‌కు 'అరబిందో' సాయం

శ్రీకాకుళం అర్బన్ : కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరగనున్న అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్‌కు అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.6లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ మేరకు ఫార్మా ప్రతినిధులు శుక్రవారం సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెక్కును అందజేశారు.

డిసిఎంఎస్ సూపర్ మార్కెట్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కత్తెరవీధిలో డిసిఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సూపర్ మార్కెట్‌ను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలతో పాటు నాణ్యమైన వస్తువులను లాభాపేక్ష లేకుండా తక్కువ ధరకు విక్రయించడానికి డిసిఎంఎస్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇబ్బందులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ సంస్థలు నడుపుతున్న వారు తప్పనిసరిగా చట్టాలు, నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ ఎస్.సల్ల సుగుణ దేవరాజ్, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎంపిపి గొండు రఘురాం, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, డాక్టర్ పైడి మహేశ్వరరావు, సుంకర కృష్ణ, ముంజేటి కృష్ణ, నర్సు నరేంద్ర, చల్లా అలివేలు మంగ, కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు గ్రీన్ ఆర్మీ ప్రోత్సాహం

పలాస: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కాశీబుగ్గ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు గ్రీన్ ఆర్మీ ప్రోత్సాహం అందించింది. కాశీబుగ్గ జెడ్‌పిహెచ్ స్కూల్‌కు చెందిన ఎన్.ప్రియమణి, జె.జ్యోత్స్న అనకాపల్లి జిల్లాలో నిర్వహించే పోటీలకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా వారికి బాల్ బ్యాడ్మింటన్, నగదును ఇచ్చి గ్రీన్ ఆర్మీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బి.గోపాల్, హెచ్ఎం చిన్నంనాయుడు, పి.శ్రీనివాస్, ఎస్.ఉపేంద్ర, పిఇటి టి.శ్రీనివాసరావు, జె.రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - పలాస

స్థానిక క్రీడా మైదానంలో జరుగుతున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల శిక్షణ శిబిరం శుక్రవారం రాత్రి ముగిసింది. వీరు ఈ నెల 22 నుంచి అనకాపల్లిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలాసకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ జోగి రామారావు తన భార్య శ్యామల జ్ఞాపకార్థం క్రీడా దుస్తులను సమకూర్చారు. పిఇటి శ్యామల సోదరి పి.లక్ష్మి అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త మల్లా భద్రయ్య, రాష్ట్ర టెన్నికాయిట్ సంఘ కోశాధికారి పి.తవిటయ్య, జాతీయ క్రీడాకారులు ఎస్‌వి జోగారావు, బి.రమేష్, జిల్లా పిఇటి సంఘ సంయుక్త కార్యదర్శి సిహెచ్ పద్మలోచనం, టెన్నికాయిట్ సీనియర్ క్రీడాకారులు ఎం.దామోదర్, దిలీప్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

డిఆర్‌ఒకు కలిశెట్టి వినతి



వినతిపత్రం అందజేస్తున్న అప్పలనాయుడు

శ్రీకాకుళంఅర్బన్:ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో రైతులు పండించే సోనామసూరి ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు ఆసక్తి కనబరచడం లేదని ఆమెకు వివరించారు. మరోవైపు యథేచ్ఛగా ఒడిశా నుంచి మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడం వల్ల స్థానిక రైతులకు అన్యాయం జరుగుతోందని ఆమెకు వివరించారు. ఒడిశా నుండి వస్తున్న ధాన్యాన్ని బోర్డర్లో ఉన్న మిల్లర్లు అరికట్టాలని, రైతులు కళ్లాల నుంచి ధాన్యం మిల్లుకు తరలించడానికి రవాణా ఖర్చులు, లోడింగ్ ఛార్జీలు ఇవ్వాలని, తేమ శాతం ఎక్కువ ఉందని క్వింటాకు 5శాతం కోత విధించడం వల్ల రైతు క్వింటాకు దాదాపు రూ.100 నష్టపోతున్నారని వివరించారు. అలాగే రణస్థలం మండలం కమ్మసిగడం జంక్షన్ నుండి దేవరాపల్లి మీదుగా వెళ్లే గ్రామాలను కలిపే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఆర్మీ క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సోమశంకర్

ప్రజాశక్తి - పలాస

పలాసలో ఆర్మీ క్యాంటీన్‌ను తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా డిప్యూటీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ బ్రిగేడియర్ కె సోమశంకర్ సేనా మెడల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ జవాన్లు, వారి కుటుంబాలకు ఆర్మీ క్యాంటీన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్నల్ విజయన్, స్టేషన్ కమాండర్ కర్నల్ పాండియన్, క్యాంటీన్ జనరల్ మేనేజర్ కర్నల్ ఎ.ఆనంద్, శ్రీకాకుళం జిల్లా మాజీ సైనికుల చైర్మన్ గ్రూప్ కెప్టెన్ ఈశ్వరరావు, పలాస యూనియన్ ప్రెసిడెంట్ ఇళ్ల మన్మథరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి టిడిపి నేతల వినతి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ఇచ్ఛాపురం: పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును ఇచ్ఛాపురానికి చెందిన టిడిపి నాయకులు కోరారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కేదారిపురంలో సామాజిక భవనం మంజూరు చేయాలని, ముచ్చింద్రలో విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో దక్కత కామేశ్వరరావు, అన్నపూర్ణమ్మ, బింగి కిరమని, తదితరులు ఉన్నారు.

అగ్ని అస్త్రం కషాయం తయారీ

ఆమదాలవలస: మండలంలోని నిమ్మతోర్లాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కజొన్నలో తెగుళ్ల నివారణ కోసం నక్క చిరంజీవి ఆధ్వర్యాన అగ్ని అస్త్రం కషాయాన్ని శుక్రవారం తయారు చేశారు. ఈ కషాయం పిచికారి చేయడం వల్ల కాండం తొలిచే పురుగులు, గొంగళి పురుగులు నివారణ అవుతాయని తెలిపారు. కషాయాల తయారీ వల్ల తక్కువ ఖర్చుతో రైతుకు అధిక లాభాలు ఉంటాయని అన్నారు. నేల సారవంతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేష్, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

గోవిందపురంలో పారిశుధ్య పనులు



కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న రామిరెడ్డి

ప్రజాశక్తి -సంతబొమ్మాళి

మండలంలోని గోవిందపురం పంచాయతీలో సర్పంచ్ రెయ్య రామిరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ఉన్న చెత్తా, చెదారాన్ని ఎత్తి గ్రామానికి వెలుపల పారవేశారు. కాలువల్లో పూడికలు తీసి, బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు రెయ్య ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణమస్తు.. కరుణించేనా?

కఠిన నిబంధనలతో లబ్ధిదారుల ఆందోళన



ప్రజాశక్తి -నౌపడ

పెళ్లిళ్ల సీజన్ మళ్లీ మొదలవుతోంది. ఈ నెల 20వ తేదీ నుంచి ముహూర్తాలు బాగా ఉన్నాయి. ఈ సంవత్సరాంతానికి సుమారు 150 వరకూ ముహూర్తాల్లో పెళ్లిళ్ల చేసుకునేందుకు జంటలు సిద్ధమవుతున్నాయి. ఏప్రిల్, జులైలో మినహా మిగిలిన అన్ని నెలల్లోనూ ముహూర్తాలు బాగా ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఈ దశలో పేదల ఇంట కళ్యాణమస్తు పథకం వెలుగురేఖలా కనబడింది. అయితే సంబంధిత దరఖాస్తులు పూరించి ఇవ్వడానికి సచివాలయాలకు వెళ్లిన తల్లిదండ్రులకు నిబంధనలు చుక్కలు చూపిస్తునాయి. వీటన్నింటినీ సకాలంలో తాము సమర్పించ గలమా అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. జనవరి నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకున్న వారికి ఫిబ్రవరిలోనూ, ఫిబ్రవరి ఒకటి నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి మే నెలలోనూ ప్రకటించిన నగదు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ దశలో తమ ఇంట పెళ్లి చేద్దాం.. వైఎస్ఆర్ పెళ్లికానుక పొందుదామని అనుకుంటున్న వారందరూ నిబంధనలే ప్రతిబంధకాలుగా ఉన్నాయి. అసలు సాయం చేయడానికే పథకం ప్రవేశపెట్టారా అని కొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఈ రోజుల్లో పెళ్లంటే ఆర్థిక భారంతో ముడిపడి ఉంది. ఒకరిని చూసి మరొకరు ఖర్చులు పెంచుకుంటూ పోతున్నారు. ఈ క్రమంలో పేదలు అప్పుల పాలవుతున్నారు. కొంతైనా ఆదుకుందామని అప్పటి టిడిపి ప్రభుత్వం చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని తీసుకొచ్చింది. అప్పట్లో చాలా మంది దీన్ని ఉపయోగించుకున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత నాలుగేళ్లగా ఈ పథకం నిలిచిపోయింది. అయితే గత సంవత్సరం అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఈ పథకాన్ని వైఎస్ఆర్ కళ్యాణమస్తుగా, షాదీ తోఫాగా నామకరణం చేసి ప్రారంభించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.లక్ష, బిసిలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న ఎస్‌సి, ఎస్‌టి వర్గాల వారికి రూ.1.20 లక్షలు, కులాంతర వివాహం చేసుకున్న బిసిలకు రూ.75 వేలు ఇస్తామన్నారు. మూడు నెలలకు ఒకసారి అప్పటివరకు ఉన్న లబ్ధిదారులకు వారి బ్యాంకుఖాతాలకు జమచేస్తామని వివరించారు. దీన్ని పొందాలనుకునే వారికి కొన్ని నిబంధనలు విధించింది.

నిబంధనలు కఠినం

నిబంధనలు కఠినంగా ఉండడంతో తమకు అవకాశం దక్కదని పలువురు పేదలు వాపోతున్నారు. వివాహ ధ్రువీకరణ పత్రం, పదో తరగతి ఉత్తీర్ణత, విద్యుత్ వినియోగం నిబంధనలు తమకు తీవ్ర ప్రతిబంధకాలుగా ఉంటున్నాయంటున్నారు. నాలుగు నెలల కిందటే ఈ పథకాన్ని ప్రారంభించినా.. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని పలు సచివాలయాల్లో ఇప్పటికీ చాలా మంది దరఖాస్తులు సమర్పించలేదని అధికారులు చెప్తున్నారు.

నిబంధనలు ఇవీ..

వివాహ సమయానికి వధువు, వరుడు మేజర్ అయి ఉండాలి. భర్త చనిపోయిన మహిళ రెండో పెళ్లి చేసుకున్నా అర్హులే. వధువు, వరుడు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కుటుంబ ఆదాయం పట్టణాల్లో నెలకు రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతాలల్లో రూ.10 వేలు దాటకూడదు. భూమి ఒక కుటుంబానికి మాగాణి మూడెకరాలు, మెట్టు పదెకరాలు లోపుగానే ఉండాలి.. కుటుంబంలో ఎవరూ పింఛనుదారులై ఉండరాదు.. అన్నికంటే ముఖ్యంగా విద్యుత్ వాడకం బిల్లు 300 యూనిట్లు దాటి రాకూడదు. ఎవరికైనా 100 చదరపు అడుగుల స్థలం మించకూడదనే నిబంధన కూడా పెట్టారు. గతంలో తెల్లరేషన్ కార్డున్న వధువు తల్లిదండ్రులు దరఖాస్తు చేస్తే నగదు ఇచ్చేవారు. ఇప్పుడు రెండు కుటుంబాల వారికి కూడా బియ్యం కార్డులుండాలి. విద్యుత్ బిల్లులు, పదో తరగతి ఉత్తీర్ణత, స్థలం విషయాల్లో చాలా మంది అనర్హులుగా మారిపోతామని అంటున్నారు. నిబంధనలు సడలించి పేదలందరికీ కళ్యాణమస్తు పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న మంత్రి అప్పలరాజు

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - పలాస

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఇప్పటి నుంచే పబ్లిక్ పరీక్షలకు ప్రణాళిక రూపొందించుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విద్యార్థులకు సూచించారు. మండలంలోని బొడ్డపాడు ఉన్నత పాఠశాలలో కన్నయ్య మాస్టర్ ఎడ్యుకేషనల్ ఛారిటీ ఆధ్వర్యంలో యుటిఎఫ్ రూపొందించిన పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను మంత్రి అప్పలరాజు విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం పాఠ్య పుస్తకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వీటిని సక్రమంగా వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ తామాడ మధన్, ఎంపిటిసి మద్దిల పాపారావు, సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సనపల రాధాకాంత్, కింతలి సుజాత, యుటిఎఫ్ నాయకులు కంచరాన రమేష్, వెంకటరమణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వీర్రాజు, ఉప సర్పంచ్ మురళి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత ఆళ్వార్ దాస్

శ్రీకాకుళం అర్బన్ : ఆరోగ్యమే మహాభాగ్యమని, నడకే దానికి మార్గం అనే సందేశాన్ని ఇచ్చిన కీర్తిశేషులు సుంకరి ఆళ్వార్ దాస్ అని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆళ్వార్ దాస్ 20వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.జి.గుప్తా, కె.వెంకటరమణమూర్తి, జి.ఇందిరాప్రసాద్, జి.సత్యనారాయణ, జి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని తరగతులకూ సంక్షేమం

స్పీకర్ తమ్మినేని సీతారాం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

వైసిపి పాలనలో అన్ని తరగతుల వారికి ప్రయోజనం చేకూరిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని చీమలవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ఈ ప్రభుత్వంలో ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ, ఇంకా ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉన్నాయా తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చివేశారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచులు ఎన్ని రామచంద్రరావు, గురుగుబెల్లి నీలా రావు, చిలకలపల్లి సురేష్, ఎంపిడిఒ ఎం.రేణుక, ఎపిఎం పైడి కూర్మారావు, కూన వెంకట సత్యనారాయణ, కె.సన్యాసిరావు, పి.రాము, జి.చంద్రయ్య, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి నీరు

పలాస: ఉద్దాన ప్రాంతంలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని, రూ.700 కోట్లతో పనులు జరుగుతున్నాయని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బొడ్డపాడు పంచాయతీలో శుక్రవారం గడప గడపకు వైసిపి ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. బొడ్డపాడు రైతులు తమ భూములను జగనన్న కాలనీ కోసం తీసుకున్నారని, అందుకు సంబంధించిన నష్ట పరిహారం అందేలా చూడాలని మంత్రిని కోరారు. బొడ్డపాడు నుంచి జాతీయ రహదారి వరకు తారురోడ్డు నిర్మించాలని కోరారు. అనంతరం మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉంగ ప్రవీణ, సర్పంచ్ తామాడ మధన్, ఎంపిటిసి మద్దిల పాపారావు, సైని దేసయ్య, పైల వెంకటరావు చిట్టి, సొర్రా తిరుపతిరావు, తహశీల్దార్ ఎల్.మధుసూదన్‌రావు, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఎఒ పోలారావు, ఎంఇఒ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవిటి: రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎంపిపి కడియాల పద్మ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు కొనియాడారు. కవిటి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అమలు తీరు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల పనితీరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ స్యాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఎంపిటిసి పూడి నీలాచలం, నాయకులు ఎన్ని అశోక్, దుద్ది ధర్మారావు, జల్లు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

గరిష్ట కూలి పొందేలా పనులు చేయండి

డ్వామా పీడీ చిట్టిరాజు



కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించి, గరిష్ట కూలి వచ్చేలా చూడాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. శుక్రవారం మెళియాపుట్టిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు సమయపాలన పాటించి, రెండు పూటలా కనీసం ఆరు గంటలు పని చేస్తే గరిష్ట కూలి గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ఉపాధి హామీ చట్టం మీ సొంత పథకం లాంటిదని, ఈ పథకంలో మీరే యజమానులని అన్నారు. జిల్లాకు ఈ చట్టం ఓ వరమని అన్నారు. అనంతరం హాజరు పట్టీని ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే పంపించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజూ పని ప్రదేశంలో రెండు పూటలు కూలీలు పనిచేస్తున్న ఫోటోలను యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలని ఆదేశించారు. కార్యాలయానికి సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే వారిపై సానుకూల దృక్పథంతో మెలగాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కూలీలతో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమార్, ఎపిఒ టి.రవి, ఇసి ఆదినారాయణ, టిసి నాయుడు, ఎఫ్ఎ శ్రీరామ్ చాణిక్య, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

మండల ప్రత్యేక అధికారి అనురాధ



మాట్లాడుతున్న అనురాధ

ప్రజాశక్తి - లావేరు

జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి, రానున్న ఉగాదికి గృహ ప్రవేశాలు పూర్తి చేయాలని జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి ఇ.అనురాధ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 2549 ఇళ్లుమంజూరు కాగా ఉగాది నాటికి ప్రారంభించడానికి 1772 ఇళ్లు ప్రారంభం లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 1033 ఇళ్లు పూర్తయినట్లు వివరించారు. ఇప్పటివరకు 73 ఇళ్లు ప్రారంభానికి నోచుకోలేదని అన్నారు. లేఅవుట్లలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లదేనని చెప్పారు. సమావేశంలో ఎంపిడిఒ కుప్పిలి సురేష్‌కుమార్, సాధు దిలీప్‌చక్రవర్తి, హౌసింగ్ ఎఇ అప్పలనాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

31 వసతిగృహ సంక్షేమ అధికారుల పోస్టులు ఖాళీ

జిల్లాలో 31 వసతిగృహ సంక్షేమ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అనురాధ అన్నారు. సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. 53 బాలుర వసతి గృహాలు, పది బాలికల వసతిగృహాల్లో 7వేల మంది విద్యార్థులు ఉన్నారని, వీరికి ఇప్పటికే దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. తొమ్మిది చోట్ల సొంత భవనాలు లేవని అన్నారు. పదో తరగతి విద్యార్థులకు ట్యూటర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న నాగరాణి



కవిటి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్వాడీలు

భవిష్యత్ బాలికలదే

ప్రజాశక్తి - కవిటి

రాబోయే రోజుల్లో బాలికలు అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుస్తారని, భవిష్యత్ బాలికలదేనని కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్ బి.సుజాత అన్నారు. బేటి పడావో - బేటి బచావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలికా విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. వీరు మాట్లాడుతూ ప్రస్తుతం బాలికల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, బాలికలు అన్ని రంగాల్లోనూ పురుషులతో పోటీపడి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఐసిడిఎస్ ఆధ్వర్యాన స్థానిక స్వర్ణభారతి విద్యా సంస్థలో బాలికా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ నాగరాణి, స్వర్ణభారతి విద్యా సంస్థ చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి బాలికల సంరక్షణ కోసం ఉన్న చట్టాలను వివరించారు. బాలికల హక్కులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జగన్మోహనరావు, రామారావు, స్వర్ణభారతి విద్యా సంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



కర్రి అప్పారావు(ఫైల్)

ప్రజాశక్తి - నౌపడ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ కూర్మనాథపురం గ్రామానికి చెందిన కర్రి అప్పారావు(59) మెకానిక్ షెడ్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 17న అప్పారావును పిన్నింటి రాజకుమార్ ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావు పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పిన్నింటి రాజకుమార్‌తో పాటు, వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు.

వాటర్ ప్లాంట్ తనిఖీ

లావేరు: మండలంలోని సుభద్రాపురం కూడలిలో ఉన్న రెహా 3 వ్యాటర్ ప్లాంట్‌ను విజిలెన్స్, ఆహార భద్రతా అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఎ-408, 409 మంచినీటి ప్యాకెట్లను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు తనిఖీ నిమిత్తం తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎఇ రవికుమార్, ఎస్ఐ రామారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంజిఆర్ పరామర్శ



రోగిని పరామర్శిస్తున్న ఎంజిఆర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మండలంలోని చిన్న కొల్లివలస గ్రామానికి చెందిన సిమ్మ కృష్ణారావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. బలగలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంజిఆర్ ఆస్పత్రికి వెళ్లి శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ముంగన్నపాడు గ్రామానికి చెందిన కుప్ప ఆనందరావు కొబ్బరి చెట్టు మీద నుండి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దబ్బపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రావు కుమార్తె రోడ్డు ప్రమాదంలో గాయపడింది. వీరిని ఎంజిఆర్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట వెలమల గోవిందరావు, అంపిలి పోలినాయుడు, మూగాడ భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మితల్లి జాతర పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం రూరల్: ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో నిర్వహించే కమ్మసిగడాం శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర వాల్‌పోస్టర్‌ను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఒడిశా నుంచి యాత్రికులు తరలివస్తారని చెప్పారు. ఆలయ కమిటీ జాతరకు పూర్తి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పోలీసుశాఖ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి తేజ, కార్యదర్శి మన్నె లక్ష్మీ ప్రసాద్, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, వెలిచేటి రాయుడు, వెలిచేటి సింహాచలం, మన్నె రాంబాబు, మన్నె శ్యాంకుమార్, నడుకుదుటి గిరి, మన్నె సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆరోగ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

కౌమార దశ బాలికలకు ఎంతో కీలకమని, ఈ సమయంలో ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక సంఘర్షణల నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పడాల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సూర్యప్రసాద్ పేర్కొన్నారు. పెద్దపాడులో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ గురుకులంలో విద్యార్థులకు కౌమార బాల్యంపై అవగాహనకు స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుకులం ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లైంగిక దాడులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు విజయ కృష్ణ, డాక్టరు జ్యోతి ఫెడరిక్, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లపై విమర్శలు తగవు

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేస్తున్న వాలంటీర్లపై చంద్రబాబుకు గుబులెందుకని వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి నాగ్ విమర్శించారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థపై విషం చిమ్మితే ప్రజలు విశ్వసించరన్నారు. వేకువ జామునే ఇంటి తలుపుతట్టి పెన్షన్ ఇస్తున్న వాలంటీర్లకు జన్మభూమి కమిటీలకు మధ్య వ్యత్యాసం ప్రజలకు తెలుసన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వాలంటీర్లు రానున్న రోజుల్లో తిరిగి జగన్‌ను సిఎం చేసేందుకు రథసారథులుగా వ్యవహరిస్తారని చెప్పారు. వీరిపైనా విమర్శలు చేయడం తగదన్నారు. ఆయనతోపాటు ఎంవి.స్వరూప్, సీపాన రామారావు, తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం ఆగ్రహారంలో రామ మందిరం వద్ద శనివారం ఉదయం 10గంటలకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మోహన్ తెలిపారు. జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరాన్ని కంటి సమస్యతో బాధపడుతున్న వారు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ డాక్టరు అప్పలకొండయ్య, ఆర్ఎంపి రాము, పిఆర్‌ఒ రాజు, మన్మథరావు, తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తాళభద్రలో రోడ్లు, కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వార్డు కౌన్సిలర్ కర్రి మాధవరావు కోరారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు మురుగు కాలువలు, రోడ్లు నిర్మించాలని కౌన్సిలర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ తాళభద్రలో కాలువలు రోడ్లు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో డబ్బీర్ నాగు, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ పదవికి భాస్కరరావు రాజీనామా

ప్రజాశక్తి - రణస్థలం


రాజీనామా పత్రాన్ని అందిస్తున్న కరిమజ్జి భాస్కరరావు

రణస్థలం రైతు సేవా సహకార సంఘం అధ్యక్ష పదవికి నగరపాలెం గ్రామానికి చెందిన కరిమజ్జి భాస్కరరావు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ మార్కేండేయ స్వామికి అందించారు. ఈ సందర్భంగా భాస్కరరావు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు సొసైటీ సిబ్బందితో కలిసి పనిచేసి ఈ సొసైటీ పరిధిలో ఉన్న రైతులకు, సొసైటీ ఖాతాదారులకు రుణాలు అందించి అన్నివిధాలా ఆదుకునేందుకు ఏంతో కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. తన వ్యక్తిగల కారణాల వల్ల ఈ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తనకు సహకరించిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, సంఘ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులను మరువలేనని, వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

రికార్డులను అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - టెక్కలి


కంప్యూటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న రవికుమార్

సబ్ ట్రజరీ కార్యాలయం పరిధిలో ఉన్న వివిధ రకాల బిల్లుల నమోదు, పంపిణీ విషయంలో సంబంధిత రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూనే, వాటిని అందుబాటులోనే ఉంచుకోవాలని ట్రెజరీశాఖ ఉప సంచాలకులు సిహెచ్ రవికుమార్ కోరారు. టెక్కలి సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉన్న బిల్లులు చెల్లింపులు, వాటి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. కార్యాలయ పనితీరుపై సమీక్షజంచారు. సంచాలకులను టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘ ఆధ్యక్షులు రోణంకి రామచంద్రరావు కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం ఆందించారు. ఆయన వెంట ఎటిఒ రామకృష్ణారావు, ఎస్‌టిఒ భవాని, భాగ్యలక్ష్మి, మన్మథరావు, తులసీరావు, ప్రదీప్, సతీష్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఆనందరావు

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పలాస

ఉద్దానం మంచినీటి ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కార్మికులకు 24 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని సిపిఎం మండల నాయకులు బి.ఆనందరావు డిమాండ్ చేశారు. మందస మండలం మకరజోల ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు పంప్ హౌస్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. వీరికి సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలకొద్ది జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే వారు జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ సంతోషిమాత ఆలయం దగ్గర కల్వర్టు పనులకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల కోసం రూ.19.99 లక్షలు మంజూరు చేశామన్నారు. పట్టణ ప్రధాన వీధుల్లో వరద నీరంతా సంతోషిమాత ఆలయం ప్రాంతంలో చేరి చిన్నపాటి వర్షానికే ముంపునకు గురయ్యేదని తెలిపారు. ఈ పనులతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. నూరు శాతం నిజాయతీతో వాలంటరు వ్యవస్థ పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి అట్లా సరోజనమ్మ, ఎంపిటిసి కూన పార్వతి, చింతాడ గణపతిరావు, తిర్లంగి జానికిరామయ్య, మండల సర్పంచులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వార్డు మెంబర్లు, జగనన్న సచివాలయ కన్వీనర్లు, అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న భాస్కర్

కవిటి: అరుదుగా లభించే బి నెగిటివ్ రక్తం దానం చేసి ఓ నిండు ప్రాణం నిలబెట్టాడు మండలంలోని కుసుంపురం గ్రామానికి చెందిన కె.భాస్కర్. బి.జగన్నాథపురం గ్రామానికి చెందిన దున్న భూదేవి(55) అనారోగ్యంతో బాధపడుతూ సోంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు తక్షణమే రక్తం అందించకపోతే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు తెలిపారు. దీంతో బి నెగిటివ్ రకం దొరకడం కష్టంగా మారింది. హెల్పింగ్ హేండ్స్ సభ్యుల సమాచారం మేరకు కుసుంపురం గ్రామానికి చెందిన కె.భాస్కర్ రక్తం అందించేందుకు ముందుకు వచ్చాడు. శుక్రవారం ఆస్పత్రికి చేరుకుని బి నెగిటివ్ రక్తం అందించాడు. ఇప్పటికే మూడు దఫాలుగా రక్తదానం చేసిన భాస్కర్‌ను వైద్యులతో పాటు స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు కాళీ సాహు, బ్లడ్ బ్యాంకు మేనేజర్ సాయి, టెక్నీషియన్ దాసు, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న భాస్కర్

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు విద్యావేత్త, నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు ఆధ్వర్యాన శుక్రవారం చీపురుపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలను ఇటీవల మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకు వెళ్లామని, పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. గ్రామస్తుంతా కలిసి కట్టుగా ఉంటేనే ఈ సమస్య సున్నితంగా పరిష్కారం అవుతుందని తెలియజేశారు. అనంతరం ఆఫ్‌షోర్ రిజర్వాయరు కడుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. టెక్కలిపట్నంలో చీపురుపల్లి నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను సందర్శించి, అక్కడ మౌలిక సదుపాయాలు ఉన్నాయో, లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పిట్ట సవరయ్య, తెప్ప శ్యాంసుందరరావు, చాపర సోమేశ్వరరావు, ఎన్.కృష్ణారావు, ఎ.బాలాజీ, ఎ.కిట్టయ్య, లింగయ్య, చిరంజీవులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

కోటబొమ్మాళికి చెందిన వైసిపి నాయకుడు హేమసుందరరాజు కుమార్తె ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబసభ్యులను కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి దంపతులు శుక్రవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జియ్యన్నపేటలో నంబాళ్ల లక్ష్మీనారాయణ, శ్యామసుందరపురంలో పి.వెంకటమ్మ మృతిచెందారు. మృతుల కుటుంబాలను ఆమె పరామర్శించి, మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కృపారాణి వెంట ఎంపిటిసి సభ్యులు రాజశేఖర్, చెంచులు, జి.రాజేష్, సింహాచలం, వెంకటరమణ, రెడ్డి లక్ష్మణరావు, అప్పలనాయుడు, జి.నాగు, మాధవరావు, ఆనంద్, గణపతి, పార్వతీశం, లక్ష్మీపతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

టెక్కలి: టెక్కలి రవీంద్రభారతి పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గురుసాయినాథ్, జ్యోతి స్వరూప్, అభిషేక్ తైక్వాండో పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ పద్మజ శుక్రవారం అభినందించారు. డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, ఇంకా బాగా క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తేవాలని కోరారు.

కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు

కోటబొమ్మాళి: పార్టీ కోసం కష్టపడిన వ్యక్తులను గ్రామ సారథులుగా ఎన్నుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళీధర్, సచివాలయ కన్వీనర్లు ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజరు పంచాయతీలో 104 మందిని గ్రామసారథులుగా ఎన్నుకోవాల్సి ఉందని, పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి, ఎన్నుకోవాలని సూచించారు. అలాగే కిష్టుపురం, పట్టుపురం పంచాయతీల సర్పంచ్‌లకు కలిసి గ్రామసారథులుగా ఎంపిక చేసేందుకు నీయమక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇర్రి చిరంజీవి, మోజ్జాడ శ్రీనివాస్, మక్క ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి - పలాస

విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అవసరమని మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం అన్నారు. కాశీబుగ్గ తపస్వి ప్రైవేటు హైస్కూల్‌లో 'పరీక్ష పై చర్చ-2023" అనే అంశంపై 25మంది విద్యార్థులకు బిజెపి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కె.బాలకృష్ణ, ఆర్.హేమాచలం, డాక్టర్ కణితి హేమాచలం, స్కూల్ డైరెక్టర్ పెంట రత్నాకర్, పి.వైకుంఠరావు, హెచ్.మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ లైసెన్సు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్‌లో ఫుడ్ లైసెన్సు పత్రాలను జిల్లా ఆహార సంరక్షణ అధికారి తపశ్విని బెహరా ఆధ్వర్యాన శుక్రవారం పంపిణీ చేశారు. సుమారు 40 మందికి ఈ పత్రాలను అందించినట్లు తెలిపారు. ఏడాదికి రూ.వంద చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంటుందని, అత్యధికంగా ఐదేళ్లకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. రుసుం చెల్లించిన కొందరికి రసీదులు అందకపోవడంతో పలువురు సందేహం వ్యక్తం చేయగా, అందరికీ శనివారం అనుమతి పత్రాలు మంజూరు చేస్తామని ఆమె చెప్పారు.


ఫుడ్ లైసెన్సు పత్రాలను పంపిణీ చేస్తున్న తపశ్విని బెహరా